నేటి నుంచే ఏపీఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్

- నేటి నుంచి 17 వరకు సర్టిఫికెట్ల ధ్రువీకరణ
- 13 నుంచి కళాశాలల ఎంపిక
- 22న సీట్ల కేటాయింపు.. ఆగస్టు 4న తరగతులు
- ఉమ్మడి జిల్లాలో 9,093 కన్వీనర్ కోటా సీట్లు

భీమవరం రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) :ఇంజనీరింగ్‌లో చేరేందుకు నిర్వహించే ఏపీఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్ సోమవారం నుంచి మొదలు కానుంది. కౌన్సెలింగ్‌లో ముందుగా నమోదు ఫీజు చెల్లింపులు 7 తేదీ నుంచి 16వ తేదీ వరకు చేసుకోవాలి. దాంతో పాటు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ ధృవీకరణ చేసుకోవడానికి 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అవకాశం ఉంది. 13వ తేదీ నుంచి 18 వరకు కళాశాలల ఎంపిక చేసుకోవాలి. 19వ తేదీ ఒకరోజు మాత్రమే కళాశాలల ఎంపికలో మార్పులు చేసుకోవచ్చు. 22వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. కళాశాలలో చేరే విద్యార్థులు 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రిపోర్టింగ్ ఇవ్వాలి. వచ్చేనెల 4వ తేదీ నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలకు 14 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా 9,093 కన్వీనర్ కోటా సీట్లు 3,897 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు మొత్తం 12,990 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటా సీట్లు 9,093 భర్తీ కావాల్సి ఉంది.

అవసరమైన సర్టిఫికెట్స్ ఇవీ

ఏపీఈఏపీ హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, ఇంటర్మీడియెట్, పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్ ఉండాలి. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జత చేయాలి. వీటితో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 600, ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 1200 రిజిస్ట్రేషన్ ఫీజుగా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. దాని రశీదు కూడా ఉండాలి.

ఈ ఏడాది విద్యార్థులు పెరిగారు..

ఈ ఏడాది ఏపీఈఏపీ సెట్ రాసినవారు పెరిగారు. ఉత్తీర్ణత కూడా బాగుంది. దీంతో ఉమ్మడి జిల్లాలో 11,739 మంది క్వాలిఫై అయ్యారు. ప్రస్తుతం కన్వీనర్ కోటా సీట్లు 9093 ఉన్నాయి. దీంతో ఇంజనీరింగ్ కళాశాలలో సీట్ల భర్తీ బాగుంటుందనే అంచనాలో యాజమాన్యాలు ఉన్నాయి. గతేడాది 85 శాతం పైగా సీట్ల భర్తీ అయ్యింది. ఈ ఏడాది అంతకు మించి సీట్ల భర్తీ అయ్యేలా కనిపిస్తున్నది. గత ఐదేళ్ళ నుంచి అక్టోబర్, నవంబర్ నెలల్లో తరగతులు మొదలయ్యాయి. గతేడాది ఆగస్టులో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలోనే మొదలుకానున్నాయి.

నిలిచిన ఏఎన్ఎంల బదిలీల కౌన్సెలింగ్

■ లోపలి పేజీలో..

చోటెవరికి..?

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గం కూర్పుకోసం కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీ మాధవ్‌ను నియమించారు. జిల్లాల వారీగా ఇప్పటికే పాత కార్యవర్గంలో వివిధ హోదాల్లో ఉన్న సీనియర్లు ఉన్నారు. ఈసారి వారందరిని యథావిధిగా కొనసాగిస్తారా, లేదా మార్పులు, చేర్పులకు దిగుతారా అనేది ఇప్పుడా పార్టీలో ఉత్కంఠగా మారింది. ప్రత్యేకించి గోదావరి జిల్లాలో పాత,కొత్త కలయికలోనే ఈ కూర్పు ఉంటుందా, లేదా అనేది ఇంకో సందేహం.



శ్రీనివాసవర్మ | పాకా సత్యనారాయణ | తపన చౌదరి | నిర్మలా కిశోర్

- రాష్ట్ర కార్యవర్గంలో పాతా, కొత్తా?
- మార్పులు, చేర్పులకే అవకాశం
- ఇప్పుడున్న కొందరికి ప్రమోషన్
- మరికొందరికి స్థానచలనం
- కమలనాథుల్లో హైటెన్షన్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లాలో ఇప్పటికే నూతన నాయకత్వం అందించిన బీజేపీ ఇప్పుడు మరోమారు రాష్ట్రస్థాయి విభాగంలోనూ సామాజిక వర్గాల వారీగా పట్టున్న నేతలను చేర్చుకోవాలని భావిస్తోంది. మారుతున్న రాజకీయ పరిణామాల క్రమంలో పట్టుసడలకుండా మరింత బలపడేలా అడుగులు వేస్తోంది. నర్సాపురం ఎంపీగా భూపతిరాజు శ్రీనివాసవర్మ, కైకలూరు ఎమ్మెల్యేగా డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఇప్పటికే కొనసాగుతున్నారు. గత ఎన్నికల్లోనూ సామాజికంగా పట్టు కోసమే బీజేపీ వ్యూహాత్మకంగా వీరిద్దరిని ఆయా స్థానాల నుంచి పోటీకి నిలిపింది. రెండు చోట్ల భారీ మెజార్టీతో ఆయా సీట్లను కైవసం చేసుకోగలిగింది.

ఉమ్మడి పశ్చిమలో నర్సాపురం ఎంపీ స్థానం ఆది నుంచి బీజేపీకి గట్టి పట్టున్న కేంద్రంగానే ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకునే నరసాపురం కోసం అప్పట్లో గట్టి పట్టు పట్టింది. బీజేపీలో వివిధ వర్గాలను కలుపుకునిపోవడం ద్వారా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాసవర్మ వైపే ఆనాడు బీజేపీ మొగ్గు చూపింది. ఇప్పుడు కేంద్రమంత్రిగా ఆయన పైకెదిగారు. రాష్ట్ర కార్యదర్శి హోదాలోనే ఉన్న వర్మను తాజాగా పీవీ మాధవ్ అధ్యక్షతన కార్యవర్గంలోకి తీసుకుంటారా, లేదా అనేది పార్టీలో చర్చకు దారి తీస్తోంది. పార్టీకి వీరవిధేయుడుగా ఉన్న కేంద్రమంత్రి వర్మ ఢిల్లీ స్థాయిలోను ఇప్పుడు గట్టి పట్టు సాధించారు. ఏపీ రాజకీయ వ్యవహారాల్లోనూ ఆయన కీలకం గా మారారు. ఎలాగూ ఉభయ గోదావరి జిల్లాల్లోనూ ఇప్పటికే బీజేపీలో కేంద్రమంత్రి వర్మ పెద్దదిక్కుగా మారారు. ఒకవైపు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఉమ్మడి తూర్పుగోదావరిలో అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే మారుతున్న పరిణామాల క్రమంలో రాష్ట్రకార్యవర్గంలో ఎవరికి చోటు కల్పిస్తారన్న విషయంలో బీజేపీలో అంతర్గత దుమారం చెలరేగుతోంది. కేంద్రమంత్రిగా వర్మ ఎదిగారు కాబట్టి ఆయన స్థానంలో మరొకరికి అవకాశం ఇస్తారా.. లేదంటే పార్టీ ఉపాధ్యక్ష స్థానానికి ప్రమోషన్ ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది.

ఈసారి ఏలూరుకు ప్రాధాన్యం

రాష్ట్రకార్య వర్గంలో ఈసారి ఏలూరు జిల్లాకు మరింత ప్రాధాన్యత ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే బీజేపీకి పట్టు దొరికేలా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో గారపాటి తపన చౌదరి చెమటోడ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఏలూరు లోక్‌సభ స్థానాన్ని ఆయన ఆశించారు. చివరి క్షణం వరకు ఆయన అభ్యర్థిత్వం పరిశీలనలోనే ఉంది. ఏళ్ల తరబడి ఇదే లోక్‌సభ స్థానంలో వ్యయానికి లెక్క చేయకుండా మారుమూల గ్రామాల్లోను బీజేపీకి సభ్యత్వం సమకూర్చేలా చేశారు. ఒకదశలో బీజేపీయేతర పక్షాల్లోని సీనియర్లు సైతం తపన చౌదరికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇదంతా బీజేపీ అగ్రనాయ కత్వం గుర్తించినా అనూహ్యంగా అప్పట్లో ఆయనను అదృష్టం వరించలేదు. అయినా ఇంకోవైపు తపన చౌదరిని ఉత్తరాంధ్ర జిల్లాల బాధ్యుడిగా నియమించారు. ఆఖరికి కేంద్ర స్థాయిలో గుర్తింపు పొందిన నామినేటెడ్ స్థానమైన చౌదరికి కల్పిస్తారని ఆయన అనుకూలురు ఊహించినా అదీ జరగలేదు. పార్టీలో ఫుల్‌టైమర్‌గా పనిచేసిన చౌదరిని పార్టీ పదవులతోనే సరిపెట్టారని ఇంకొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు మార్పు, చేర్పుల్లో భాగంగా తపన చౌదరికి మరింత ప్రాధాన్యత ఇస్తారని భావిస్తున్నారు. రాష్ట్రకార్యవర్గంలో ఈ ప్రాధాన్యత ఉండబోతుందని ఆ పార్టీలో వినిపిస్తోంది. అలాగే బీజేపీ మోర్చా అధ్యక్షురాలిగా నిర్మలా కిశోర్ ఇప్పటివరకు వ్యవహరించారు. పోలవరం నియోజకవర్గానికి చెందిన ఆమెను అన్ని విధాలా ఆలోచించి గతంలో రాష్ట్రస్థాయి మోర్చాకు ఎంపిక చేశారు. ఇప్పుడామె స్థానంలో వేరొకరికి అవకాశం లభించబోతుందని చెబుతున్నారు.

మిగతావారి సంగతేంటి

జిల్లాలో సీనియర్ నేతగా, బీజేపీ క్రమశిక్షణా సంఘం చైర్మన్‌గా ఉన్న ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణను యథావిధిగా కొనసాగిస్తారా, లేదా అనేది మరో ప్రశ్న. వాస్తవానికి నర్సాపురం నియోజకవర్గ పరిధిలోని భీమవరం కేంద్రంగా పాకా

(మిగతా 8వ పేజీలో)



ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు.. అమ్మవారికి మహిళల బోనాలు

పెద్దింట్లమ్మకు బోనాలు

కైకలూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి ఆదివారం మహిళలు బోనాలను సమర్పించారు. మహిళలు బోనా లతో ఊరేగింపుగా విచ్చేశారు. అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలను అందజేశారు. దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. మహిళలు పాల పొంగళ్లను పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లును నిర్వహించారు.

మెగా పీటీఎం పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ : కలెక్టర్

ఏలూరు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు/జూనియర్ కళాశాలల్లో ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమం ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పీటీఎం 2.0 నిర్వహణ ఏర్పాట్లపై ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. పీటీఎంకు విద్యార్థులంతా స్కూలు యూనిఫాంలో తమ తల్లిదండ్రులతో సహా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి భోజన సదుపాయాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాల ఆదేశించారు. విద్యార్థులతో స్కూలు ఆవరణలో మొక్కలు నాటేందుకు అటవీశాఖ నుంచి 1,64,170 వివిధ రకాల మొక్కలు సిద్ధం చేశారని, వీటిని సమీపంలోని అటవీశాఖ నర్సరీల నుంచి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఫొటోసెషన్ నిర్వహించాలని, అమ్మ ప్రాముఖ్యతను తెలిపేలా తల్లికి పాదాభివందనం కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. పీటీఎం కార్యక్రమం వివరాలన్నింటినీ లీప్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. బాలబాలికలందరికీ ఆరోగ్య పరీక్షలను రెండురోజుల్లోగా పూర్తిచేసి, 10వ తేదీన హెల్త్ కార్డులను అందజేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని ఆదేశించారు.



నేత్రపర్వం.. జగన్నాథుడి రథోత్సవం

ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం జగన్నాథుడి దివ్యరథోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సుభద్ర, బలభద్ర, జగన్నాథుడి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురం వరకు ఈ రథయాత్ర కొనసాగింది.



■ లోపలి పేజీలో..

హైస్కూల్ ప్లస్‌లకు తీరనున్న.. పీజీటీల కొరత

ఏలూరు అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేనిచోట మండలానికి ఒకటి చొప్పున ఇంటర్మీడియట్ విద్యతో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ (జడ్పీ జూనియర్ కళాశాల)ల్లో టీచర్ల కొరతను ప్రత్యామ్నాయ విధానాల్లో భర్తీ చేయడానికి విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 25 హైస్కూల్ ప్లస్‌లు నిర్వహిస్తున్నారు. వీటిలో బోధించేందుకు హైస్కూళ్లలో పీజీ విద్యార్హతలతో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను పీజీటీలుగా కౌన్సెలింగ్ ద్వారా నియమించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం తొమ్మిదిమంది దర ఖాస్తు చేసుకోగా నలుగురికి బదిలీలు ఖరారయ్యాయి. నూతన స్థానాల్లో పీజీటీలు చేరడంతో ఆ మేరకు టీచర్ల కొరత ఆయా హైస్కూల్ ప్లస్‌లలో ఏర్పడింది. గతనెల ఒకటోతేదీ నుంచి ఇంటర్మీడియట్ తరగతులు జరుగుతుండడంతో సంబంధిత హైస్కూల్ ప్లస్‌లలో ఆయా సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలు బోధించేందకు పీజీటీ/స్కూల్ అసిస్టెంట్ల కొరత ఏర్పడింది. తాజాగా ఈ కొరతను ప్రత్యామ్నాయ మార్గాల్లో భర్తీ చేయడానికి విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మండలాల్లో మిగులు (సర్‌ప్లస్)గా గుర్తించిన టీచర్లను క్లస్టర్ ఉపాధ్యాయులుగా రిజర్వ్‌లో ఉంచారు. వీరిలో ఆయా సబ్జెక్టుల్లో పీజీ విద్యార్హతలున్న క్లస్టర్ టీచర్లను పీజీటీలుగా టీచర్ల కొరతవున్న హైస్కూల్ ప్లస్‌లకు పంపాలని కసరత్తు చేస్తున్నారు.

దీనికిముందుగా ఉమ్మడి జిల్లాలోని అన్ని హైస్కూల్ ప్లస్‌లలో గ్రూపుల వారీగా పీజీటీల సంఖ్య, తరగతుల్లో వున్న విద్యార్థుల సంఖ్యలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే క్లస్టర్ టీచర్లను డిప్యుటేషన్లపై నియమించేందుకు నిర్ణయానికి వస్తారు. కాగా ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా క్లస్టర్ టీచర్లు కేవలం ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలల్లో 12 మంది ఉండగా, వీరిలో నలుగురికి మాత్రమే పీజీ విద్యార్హతలున్నాయి. సాధారణ బదిలీల సందర్భంగా విడుదలైన మార్గదర్శకాల ప్రకారం క్లస్టర్ టీచర్ల సేవలను సంబంధిత క్లస్టర్ పరిధిలోనే వినియోగించుకుంటామని విద్యాశాఖ ప్రకటించగా, హైస్కూల్ ప్లస్‌లలో పీజీటీల కొరతను భర్తీ చేయాలంటే ఈ నిబంధనలను సడలించాల్సి ఉంటుందని భావిస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొల్లేరు నాయకులు

చేపల చెరువుల లీజుపై బహిరంగ చర్చకు సిద్ధమా..

- మాజీ ఎమ్మెల్యే కొఠారుకు కొల్లేరు నాయకుల సవాల్

ఏలూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి):కొల్లేరు వాసుల నుంచి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయల లీజు సొమ్ములు తిరిగి చెల్లించే వరకు అబ్బయ్య చౌదరిని వదిలే ప్రసక్తి లేదని, లీజుల విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా.. అని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి కొల్లేరు సీనియర్ నాయకులు సైదు సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నేత బొప్పన సుధాకర్, నంబూరి నాగరాజు, నేతల రవి సవాల్ విసిరారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వైసీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరుల సమక్షంలో ఎమ్మెల్యే చింతమనేనిపై ఇష్టానుసారంగా అబ్బయ్య చౌదరి మాట్లాడారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లేరు బాధితుల తరపున నీ ఇంటిని ముట్టడించినప్పుడు నీ తండ్రి కొఠారు రామచంద్రరావుతో కలిసి మేము మీకు డబ్బులు ఎందుకివ్వాలని మమ్మల్ని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. కొల్లేరులో లీజులు వసూలు చేయనప్పుడు కొంతమంది కూటమి నాయకులతో రాజీ చర్చలు ఎందుకు జరుపుతున్నారని ప్రశ్నించారు. కొల్లేరు వాసులకు రూ.ఆరు కోట్లు లీజు సొమ్ము చెల్లించే వరకు వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. మీ పాలనలో అక్రమ కేసులు బనాయించి పలువురిని జైలుకు పంపారని, తాము ఆ పని చేయడం లేదని పేర్కొన్నారు. కోకో, పామాయిల్ రైతులపై అబ్బయ్య చౌదరి మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. మాగంటి నారాయణ ప్రసాద్, మిల్లుబాబు, గుత్తా అనిల్, సైదు శ్రీహరి, మరడాని రవి, దేవరపల్లి ఆదాము, ఈడ్పుగంటి అనిల్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,844 కేసులు రాజీ : ఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 5వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో పోలీస్ శాఖకు సంబంధించి 2,844 కేసులు రాజీ జరిగాయని, రాజీయే రాజమార్గమనే నినాదంతో ఉభయులు పరిష్కరించుకోవడం అభినందనీయమని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లాలో 827 ఐపీసీ కేసులు, 417 స్పెషల్ అండ్ లోకల్‌లాస్ కేసులు, 143 ఎక్సైజ్ కేసులు, 1,454 పెట్టీ కేసులు మొత్తం 2,844 కేసులు పరిష్కారం జరిగాయని ఎస్పీ తెలిపారు. ఇది ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగిందనేందుకు సూచనగా ఉందని పేర్కొన్నారు. రాజీమార్గమే శ్రేష్టమార్గం అనే నినాదంతో కుటుంబ, వివాహ సంబంధిత తగాదాలు, యాక్సిడెంట్, చిన్న చిన్న తగాదాలు వంటి కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. కేసుల పరిష్కారానికి డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్‌బాషా, ఎస్ఐ రాజారెడ్డి, కోర్టు మానిటరింగ్‌సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, సిబ్బంది సమష్టిగా కృషి చేశారన్నారు. ప్రజలకు లోక్ అదాలత్ ప్రాముఖ్యతను ఇంకా విస్తృతంగా తెలియజేస్తూ ముందు నుంచి మరిన్ని కేసులలో రాజీద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

పైసలు లేవు!



- విడుదల కాని 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు
- నిధుల గండంతో సర్పంచ్‌ల ఆవేదన

ఏలూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు వట్టిపోయాయి. నిధులు లేమితో కునారిల్లుతున్నాయి. కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి పల్లెల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు నేటి వరకు పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. నెలలు తరబడి పాలక వర్గాలు ఆయా నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి.

జిల్లాలో పంచాయతీలకు రావాల్సిన రూ.40 కోట్లు విడుదల చేయాలని ఇటీవల సర్పంచ్ సంఘాల నేతల పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శిని కలిసి వినతిప్రతం అందజేశారు. అయినా ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తొలుత టీడీపీ ప్రభుత్వం అమలు చేసింది. జిల్లలో పంచాయతీలకు నవంబరులో 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు రూ.20 కోట్లు విడుదల చేసి ఇచ్చిన హామీని నెలబెట్టుకుంది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని సర్పంచ్‌లు ఆశించారు. అయితే రెండో విడత ఆర్థిక సంఘం నిధులు రూ.40 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. పంచాయతీల బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉన్నా ఆ ఊసే మరిచింది. ఉదాహరణకు ఏలూరు రూరల్ మండలంలో 15 పంచాయతీలు ఉన్నాయి. వీటికి సంబంధించి ఆర్థిక సంఘం నిధులు రెండో విడత సుమారు రూ.90 లక్షలు పైగా విడుదల చేయాల్సి ఉంది.

నిధుల విడుదలతోనే వెలుసుబాటు

వర్షాకాలం మొదలైంది. అంటువ్యాధులు, జ్వరాలు ప్రభలే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న హెచ్చరికలున్నాయి. గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నిధులు లేక ఏ పనులు చేయలేని పరిస్థితుల్లో పంచాయతీ పాలక వర్గాలు ఉన్నాయి. నిధులు విడుదల చేస్తే ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటి ఇంటి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు వంటి పనులకు వెసులుబాటు ఉంటుందని సర్పంచ్‌లు తెలుపుతున్నారు.

తక్షణం నిధులు విడుదల చేయాలి..



గ్రామాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే 15వ ఆర్థిక సంఘం నిధు లు విడుదలతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలి. ఆర్థిక సం ఘం నిధులను ప్రభుత్వం విడుదల చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం తరహాలోనే కూటమి ప్రభు త్వం వ్యవహరించడం దుర్మార్గం. ఉపాధి మెటీరియల్ పెమెంట్స్ పంచాయతీలకు జమ చేయాలి.

- ఎం.సంతోష్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం, సర్పంచ్ ముప్పవరం



తాడేపల్లిగూడెం మార్కెట్లో కూరగాయలు

పచ్చిమిర్చి @ 60

పెరిగిన వంగ, బెండకాయల ధరలు

తాడేపల్లిగూడెం/పాలకొల్లుఅర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లలో కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయి. చిన్నచేతి సంచిలో కూరగాయలు నిండాలి అంటే సుమారుగా రూ.300 సరిపోవడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర మరింత ఎక్కువగా ఉంది. అదేబాటలో వంగ, బెండకాయలు ఉన్నాయి. తాడేపల్లిగూడెం మార్కెట్లో గత వారంతో పోల్చుకుంటే ఈవారం కిలోకు ఏకంగా రూ.20 పెరిగాయి. ఉల్లిధరలు మాత్రం నిలకడగానేఉన్నాయి. పచ్చిమిర్చి గతవారం కిలో రూ.40 ఉంటే ఈ వారం రూ.60కు చేరింది. బెండ రూ.40 నుంచి రూ.60కు, తెల్లవంకాయలు రూ.60 నుంచి రూ.80కు పెరిగింది. ధరలు పెరగడానికి కారణం మార్కెట్లో వీటి దిగుమతి తక్కువగా ఉండడమేనని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌కు వచ్చే పచ్చిమిర్చి సిద్దాంతం పరిసర ప్రాంతాల నుంచి వస్తుంది. తెల్లవంకాయలు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్నారు. బెండకాయలు, బీరకాయలు తాడేపల్లిగూడెం మండలంలోని లింగారాయుడుగూడెం పరిసర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతోంది. మిగిలిన కూరగాయల ధరలు గతవారంతో పోల్చుకుంటే మార్పులేదు. ఉల్లి ధర హోల్‌సేల్‌గా 50 కిలోల బస్తా రూ.1200కు, 4కిలోలు రూ.100, 10కిలోల బస్తా రూ.250కు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి మాత్రమే తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ఉల్లి దిగుమతి అవుతోంది. మరో 20 రోజుల్లో ఉల్లిధరలు పెరగవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు. రెండు నెలల్లో కర్నూలు నుంచి ఉల్లిదిగుమతి అయితే ధరలు తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

లోక్ అదాలత్‌లో 6,325 కేసులు పరిష్కారం

» ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



ఏలూరు క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లో 6,325 కేసుల పరిష్కారానికి సహకరించిన అధికారులకు, కక్షిదారులకు ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా ఈనెల 5న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు జిల్లా వ్యాప్తంగా 35 బెంచీలు ఏర్పాటు చేసి శనివారం రాత్రి వరకు కేసులను పరిష్కరించామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 20 సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేశామన్నారు. కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులెచ రెవెన్యూ సిబ్బంది, ఇన్సూరెన్సు అధికారులు, బ్యాంకు అధికారుల, చిట్‌ఫండ్ ప్రతినిధులు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, మిగతా శాఖల అందరికి ఆమెతో పాటు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



గారపాటి జాన్వి పద్మజ చౌదరిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సేవాభావంతో ముందుకు సాగాలి

చాగల్లు, జూలై 6(ఆంధ్రజ్యోతి): చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని మరింత సేవాభావంతో నూతన కార్యవర్గం ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ జిల్లా పాత గవర్నర్ డాక్టర్ వీకే పంకజాక్షన్ అన్నారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా వల్లిపల్లి వెంకటరామారావు, ఉపాధ్యక్షులుగా నల్లూరి అప్పారావు, ఆళ్ళ సత్తిబాబు, కార్యదర్శిగా కంటిపూడి అచ్యుత రామప్రసాద్, కోశాధికారిగా కోట నాగేశ్వరరావు, మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్‌గా కొడవటి కాశీవిశ్వేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులతో సీనియర్ లయన్స్ కొత్తపల్లి రవికుమార్ ప్రమాణం చేయించి బాధ్యతలు అప్పగించారు. ముఖ్య అతిథిగా అల్లూరి గౌరీరావు మాట్లాడారు.

జాన్వి పద్మజ చౌదరికి ఘన సన్మానం..

చాగల్లుకు చెందిన గారపాటి జాన్వి పద్మజచౌదరి ఏఐఐఎంఎస్ (ఎయిమ్స్) ఢిల్లీలో సీటు సాధించింది. వైజాగ్ ఆంధ్ర మెడికల్ కళాశాల (కేజీహెచ్)లో ఎంబీబీఎస్ చేసిన ఆమె ఎయిమ్స్ పీజీ ప్రవేశ పరీక్షలో ఆలిండియా స్థాయిలో నీట్‌లో 163వ ర్యాంకు సాధించారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆమె తల్లిదండ్రులు గారపాటి శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపంపతుల ప్రోత్సాహంతో సీటు సాధించి, చిన్న వయస్సులోనే సర్జన్ అయ్యే అవకాశం పొందింది. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. పాస్ట్ ప్రెసిడెంట్ ఆళ్ల వెంకట సత్యనారాయణ, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు పిచ్చికల వెంకట సత్యనారాయణ, కోడి నాగేశ్వరరావు, కోడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆరిమిల్లి, కూటమి నాయకులు

13న తణుకులో మెగా జాబ్ మేళా

తణుకు, జూలై6(ఆంధ్రజ్యోతి) : తణుకు నియోజకవర్గంలో యువత కోసం ఈనెల 13న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో సంబంధిత జాబ్ మేళా పోస్టర్‌ను కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివారం ఉదయం పది గంటలకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, ఫార్మా, అగ్రికల్చర్, బ్యాంకింగ్, ఐటీ, ఐటి సర్వీస్ రంగాల్లో 60పైగా కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి, డిగ్రీ, డిప్లమో, ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల యవత మహేష్, 96406 88000, మోహన్ 97016 02954, వేణు 85200 54554, ప్రశాంత్ 93569 99956, జాన్ 80191 64852 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో కూటమి నాయకులు మంత్రిరావు వెంకటరత్నం, కలగర వెంకటకృష్ణ, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, వంట్టెద్దు రాజా, తాతపూడి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమవరం క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడులలో బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేశామని భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు తెలిపారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో ఎం.శ్రీనివాసరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందా.. గోవింద..

» తొలి ఏకాదశి పురస్కరించుకుని శ్రీవారి క్షేత్రం కిటకిట



శ్రీవారి దర్శనానికి క్యూలో వేచి వున్న భక్తులు..అనివేటి మండపంలో కోలాట ప్రదర్శన

ద్వారకాతిరుమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీమహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే రోజుగా పండితులు చెబుతారు. ఈ ఏకాదశి నుంచే హిందువుల పండుగలు ప్రారంభమవుతాయి. పలు ప్రాంతాల నుంచి చినవెంకన్నను దర్శించుకునేందుకు భక్తులు శనివారం రాత్రికే ఆలయానికి చేరుకున్నారు. పలువురు పాదయాత్రగా క్షేత్రానికి రాగా వారంతా ఆదివారం తెల్లవారజామున శ్రీవారి తొలిదర్శనాన్ని చేసుకున్నారు. ఉదయం నుంచి అధికంగా వచ్చిన భక్తులతో అన్ని విభాగాలు నిండిపోయాయి. దర్శన అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో ఆదివారం బాలలు నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. కృష్ణా జిల్లా కొత్తగూడెంకు చెందిన భక్తాంజనేయ కోలాటబృందం బాలలు, మహిళలు ముందుగా సంప్రదాయ దుస్తులు ధరించి క్షేత్రానికి వచ్చి కోలాటాలు జరుపుతూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. పలు దేవతా మూర్తులను కీర్తిస్తూ నిర్వహించిన కోలాట ప్రదర్శన చేశారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.2 లక్షలు విరాళం

శ్రీవారి ట్రస్టులకు దాతలు వేర్వేరుగా రూ.2లక్షలు విరాళం అందించారు. చినవెంకన్న గోసంరక్షణ ట్రస్టుకు ఏలూరు జిల్లా ముసునూరు మండలం సూరేపల్లి వాస్తవ్యులు వడ్లపట్ల గాంధీ, అనసూర్యావతి రూ.లక్ష విరాళాన్ని ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీకు అందజేశారు. శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గుంటూరుకు చెందిన దాత కొరిటాల శ్రీనివాస్ మరో లక్ష రూపాయలు విరాళం అందజేశారు. దాతల కుటుంబసభ్యులు స్వామి వారి దర్శన అనంతరం సూపరింటెండెంట్ కిషోర్ బాండులను అందజేశారు.



గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్లలో నిలబడ్డారు. వాతావరణంలో మార్పుల కారణంగా కమిటీవారు త్వరగా దర్శనాలు ముగించుకుని అటవీ ప్రాంతం నుంచి బయటకు వెళ్లాలని భక్తులకు సూచించారు. వేలాదిగా భక్తులు ఆలయానికి రావడంతో తాకిడి పెరిగింది. అమ్మవారి దర్శనాలకు వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కావాల్సిన ఏర్పాట్లను కమిటీ వారు పర్యవేక్షించారు.



అట్టహాసంగా సాగుతున్న జగన్నాథుని దివ్య రథయాత్ర

జగన్నాథుడి రథోత్సవం

» లక్ష్మీపురం ఆలయంలో ముగిసిన ఉత్సవాలు

ద్వారకాతిరుమల : కల్కి భగవానుడిగా జగన్నాథుడు ఆదివారం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా జగన్నాథుడు ఖడ్గాన్ని డాలును ధరించి కల్కి అవతారంలో సాక్షాత్కరించారు. గత నెల 27 నుంచి ప్రారంభమైన రథోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. జగన్నాథుని దివ్య రథోత్సవాలలో భాగంగా సుభద్ర, బలభద్ర, జగన్నాథులతో కొలువైన రథచక్రాలు ముగింపు రోజున ఆలయం నుంచి బయటకు కదిలాయి. లక్ష్మీపురం ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురం వరకు ఈ రథయాత్రను దేవస్థానం అట్టహాసంగా నిర్వహించింది. రథయాత్రను వీక్షించిన భక్తులు పరవశించారు.

రథయాత్ర ఇలా...

అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పూరీ క్షేత్ర నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అట్టహాసంగా కోవెల నుంచి తెచ్చి రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై ఉంచి అలంకరించారు. అధికారుల పూజలు, బలిహరణల అనంతరం రథయాత్రను ప్రారంభించారు. మేళతాళాలు, సన్నాయి డప్పు వాయిద్యాలు, కోలాట భజనలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ రథయాత్ర తిమ్మాపురం వరకు నేత్రపర్వంగా జరిగింది.

నిలిచిన ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్

» నేటికి వాయిదా

ఏలూరు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఆదివారం జరిగిన సాధారణ బదిలీల కౌన్సెలింగ్ ఆద్యంతం ఆవాంతరాలు, అభ్యంతరాల నడుమ రాత్రి తొమ్మిది గంటల సమయంలో అర్థాంతరంగా నిలిచిపోయింది. ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వేదికగా జూమ్ విధానంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. తొలుత ఏజెన్సీ మండలాల్లోని సచివాలయాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లోనే పలు అభ్యంతరాలు వ్యక్తంకాగా, ఆ తదుపరి మిగతా మండలాల్లోని పీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ చేపట్టగా వెకెన్సీలు, ప్రిఫరెన్షియల్ కేటగిరీల కింద బదిలీలకు దరఖాస్తుచేసుకున్న వారికి స్థానాల కేటాయింపు విషయంలో ప్రతిష్టంభన ఎదురవడంతో కౌన్సెలింగ్‌ను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి, ఆ మేరకు పీహెచ్‌సీలకిచ్చిన జూమ్ కనెక్షన్లను నిలిపివేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వేచివున్న వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు తీవ్ర నిరాశకు గురయ్యారు.

ప్రభుత్వమిచ్చిన గడువుతేదీ ముగిసిన తర్వాత ప్రారంభమైన ఈ బదిలీల కౌన్సెలింగ్‌పై ముందునుంచీ పలు విమర్శలు తలెత్తాయి. బదిలీల కౌన్సెలింగ్‌ను చేపడుతున్నట్టు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు ఆదివారం మధ్యాహ్నం 12గంటల తర్వాత సమాచారం పంపించిన అధికారులు, ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయాల్లో వెకెన్సీల జాబితాలను వైద్యాధికారులకు సాయంత్రం ఐదు గంటల్లోపే ఇ-మెయిల్ చేస్తామని చెప్పి, రాత్రి 7.30 గంటలు దాటినా పంపకపోవడంతో పలుచోట్ల బదిలీ దరఖాస్తుదారులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. సాయంత్రం కౌన్సెలింగ్ ప్రారంభంకాగా, ఉమ్మడి జిల్లాలోని 754 మంది ఏఎన్‌ఎంలు సంబంధిత పీహెచ్‌సీలకు హాజరయ్యారు. పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్ల సమక్షంలో బదిలీలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేశారు. సీనియార్టీ జాబితాల ప్రకారం బదిలీలు జరగాల్సిఉండగా, ట్రైబల్ మండలాల ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ పూర్తయ్యేలోపే పలు సమస్యలు తలెత్తడంతో కొందరిని నిలిపివేసి, తదుపరి వారికి చేపట్టినట్టు తెలిసింది. మరోవైపు ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సచివాలయాల్లో వెకెన్సీల వివరాలను ఖరారు చేసుకోవడానికి కౌన్సెలింగ్ సమయంలో వైద్యాధికారులపై ఆధారపడాల్సి రావడాన్ని ముందస్తు ఏర్పాట్లు జరగలేదనడానికి నిదర్శనమని చెబుతున్నారు.

వాస్తవానికి ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో ఏఎన్‌ఎంల వెకెన్సీల వివరాలను జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ అధికారులనుంచి సేకరించి జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిస్తే ఈ సమస్య తలెత్తేదికాదని పలువురు మెడికల్ ఆఫీసర్లు వివరించారు. దరఖాస్తు చేసుకున్న ఏఎన్‌ఎంలు ఐదేసిచొప్పున వెకెన్సీలకు ఐచ్ఛికాలివ్వగా, వాటిలో ఖాళీలు లేవనిచెబుతూ వేరే వాటిని ఎంచుకోవాలని సూచించిన అధికారులు ఆ మేరకు వెకెన్సీలను చూపించకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు జూమ్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్‌ను డీఎంహెచ్‌వో, ఏవోల సమక్షంలో కార్యాలయ సీసీ నిర్వహించడం వైద్య ఆరోగ్యశాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఈ బదిలీలు గతనెల 30లోగా జరగాల్సిఉంది. తాజాగా ఉత్తర్వులను సవరించి ఈనెల 5లోగా బదిలీల కౌన్సెలింగ్‌ను పూర్తిచేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ రాష్ట్ర కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సంబంధిత ఏఎన్‌ఎంల విభాగాన్ని పర్యవేక్షించే ఉద్యోగి సెలవు పెట్టడంతో కౌన్సెలింగ్‌ను ఆదివారం నిర్వహించాల్సి వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏవో డాక్టర్ గంగాభవాని తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహణను డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని పర్యవేక్షించారు.

- బదిలీల వెకెన్సీల్లో పారదర్శకత లోపించడం, సీనియార్టీ ఆర్డర్ ప్రకారం నిర్వహించకుండా కొందరి విషయంలో జాప్యం చేయడం, తదితర అంశాల నేపథ్యంలో ఎవరికైనా బదిలీల్లో అన్యాయం జరిగితే సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఏఎన్‌ఎంలు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈలోగానే కౌన్సెలింగ్ సోమవారానికి వాయిదా పడింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1468 మంది గ్రామ/వార్డు సచివాలయాల ఏఎన్‌ఎంల రిక్రూట్‌మెంట్ జరుగగా, వీరిలో 264 మందికి ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్)గా ఇటీవలే పదోన్నతులిచ్చారు. వీరిని మినహాయించగా మిగతా 1204మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. వైద్య ఆరోగ్య శాఖ పెట్టిన జాబితాలో 800మంది వివరాలు ఉండడం గమనార్హం. ప్రస్తుత స్థానాల్లో ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన వారిని బదిలీ చేస్తామని డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు చెబుతున్నాయి.



లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ చేగొండి, ముత్యాల శ్రీనివాస్ తదితరులు

జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆవిర్భావం

» లోగో ఆవిష్కరించిన మాజీ ఎంపీ హరిరామజోగయ్య, అధ్యక్షుడు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ నూతనంగా ఏర్పడింది. ఆదివారం స్థానిక రోటరీ భవనంలో జరిగిన సమావేశానికి ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ గౌరవ సలహాదారుగా మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య, అధ్యక్షుడిగా ముత్యాల శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డాక్టర్ కేఎస్‌వీఎస్ రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా సీవీవీ సత్యనారాయణమూర్తి, రాజా వన్నెంరెడ్డి, గుడాల హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బోనం వెంకటనర్సయ్య, సహాయ కార్యదర్శులుగా విన్నకోట వెంకటరమణ, కోశాధికారిగా యిమ్మిడి రాజేష్, రాజేంద్రకుమార్, మరో 12 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లోగోను ఆవిష్కరించి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో చేగొండి హరిరామజోగయ్య మాట్లాడుతూ ఈ పరిషత్ సంస్థతో తెలుగు భాష ప్రాచుర్యం, ఔన్నత్యం తెలపడంతో పాటు కళలకు పుట్టినిల్లు అయిన పాలకొల్లులో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌ను నెలకొల్పడమే ఆశయమన్నారు. అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టులో షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, మరో 9 షార్ట్ ఫిల్మ్‌లకు ఒక్కొక్కదానికి రూ.5వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని, త్వరలో పూర్తి విధి విధానాలు ప్రకటిస్తామన్నారు. పాలకొల్లులో 24క్రాఫ్ట్ ఒకే వేదికపై ఉండే విధంగా ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు ప్రభుత్వం, నాటక, సినీరంగ ప్రముఖులతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. సమావేశంలో గుడాల హరిబాబు, డాక్టర్ ఎంఆర్‌కే రాజు, చవాకుల సూర్యనరేష్, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, విరాకుల రమణ, వీరా పోతన, కె.శాంతారావు, పీఎస్ఎన్ రాజు, ముత్యాల శ్రీవాత్సవ్‌ప్రదీప్, బోళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం లూథరన్ చర్చిలో క్రైస్తవుల మధ్య వివాద దృశ్యం

లూథరన్ చర్చిలో బాహాబాహీ

నరసాపురంటౌన్,జూలై6(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన లూథరన్ చర్చిలో ఇద్దరు పాస్టర్ల మధ్య ఆదిపత్య పోరు ఆదివారం జరిగింది. విశ్వాసులు కూడా రెండు వర్గాలుగా చీలి బాహాబాహీకి దిగారు. ఈమేరకు చర్చిలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరికి పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. ఆదివారం చర్చిలో ప్రార్థనలు చేసేందుకు పాస్టర్లు చంద్రశేఖర్, నవకుమార్ పోటీ పడ్డారు. ఇద్దరూ ప్రార్థనలు చేసేందుకు సిద్ధం కావడంతో ఒక వర్గం అడ్డుకుంది. ఈక్రమంలో పాస్టర్లిద్దరిని సమర్థిస్తూ క్రైస్తవులు కూడా రెండుగా చీలి గొడవకు దిగారు. చివరికి పోలీసులు పెద్దఎత్తున్న చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు చర్చిలో పలుమార్లు చోటు చేసుకున్నాయి.

పిచ్చి కుక్క దాడి.. తొమ్మిది మందికి గాయాలు



108 వాహనంలో బాధితులు

జీలుగుమిల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో తొమ్మిది మంది ఆస్పత్రిపాలైన ఘటన జీలుగుమిల్లి శివారు రామన్నపాలెంలో ఆదివారం జరిగింది. గ్రామంలో ఉదయం సమయంలో పిచ్చి కుక్క దాడి చేసి ఇళ్లవద్ద వున్న వృద్ధుల చేతులు, కాళ్లను కరిచింది. జీలుగుమిల్లిలో ఓ ఇంటి వద్ద గేదెను కరిచేందుకు ప్రయత్నిం చగా స్థానికులు వెంబడించి చంపారు. పిచ్చికుక్క కాటుకు గురైన వారిలో పి.కృష్ణ, బి.నీలిమ, ఎస్.నాగేశ్వరమ్మ, కె.రమణ, కె.రాణి, పి.కనకమ్మ, ఎస్.బద్రమ్మ, కె.సాయి, ఎం.దావీదు ఉన్నారు. బాధితుల్ని స్థానికులు జీలుగుమిల్లి పీహెచ్‌సీకి తీసుకు రాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించి, చికిత్స అందిస్తున్నారు.

క్రైం సమాచారం

మద్యం తక్కువ పోశాడని..

» ఇద్దరి మధ్య గొడవ.. ఒకరి హత్య



గోవింద్ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూలీగా వచ్చిన డబ్బులతో కొనుగోలు చేసిన మద్యం తనకు తక్కువ వేశాడనే గొడవ హత్యకు దారితీసింది. తాడేపల్లిగూడెం పట్టణ సీఐ ఆదిప్రసాద్ తెలిపిన వివరా లివి.. పెంటపాడుకు చెందిన రెడ్డి గోవింద్(55), తాడేపల్లిగూడెం కొత్తపేటకు చెందిన గుబ్బల మల్లేశ్వరావు అనే ఇద్దరూ సత్తి వేణుగోపాల్‌రెడ్డి పశువులకు అవసరమైన గడ్డి కోసేందుకు వెళ్తుంటారు. ఆదివారం ఉదయం గడ్డి కోసేందుకు ఇద్దరూ పనికి వెళ్లారు. మూడు గడ్డి మోపులు కోస్తే ఒక్కో మోపు రూ.50 చొప్పున రూ.150 ఇచ్చాడు. ఆ నగదుతో సమీపంలోని మద్యం షాపు వద్ద ఇద్దరూ కొనుగోలు చేసి మద్యం తాగుతుండగా తనకు మద్యం సమానంగా పోయలేదని మల్లేశ్వ రరావుతో వాదనకు దిగాడు. ఈ క్రమంలో మల్లేశ్వరరావు భుజంపై కొడవలి పిడితో గోవిందు కొట్టగా ఆ కోపంలో పక్కనే ఉన్న టైల్స్ రాయితో బలంగా గోవిందు మెడపై కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై గాయపడ్డాడు. గోవింద్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు. మృతుడు గోవింద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడిపై ఉన్న గొడవల కారణంగానే యజమాని వేణుగోపాల్ రెడ్డి పథకం ప్రకారం తన తండ్రిని చంపించాడని కుమార్తె ఆరోపిస్తోంది.

4,300 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

పెదవేగి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, రైస్‌మిల్లుకు తరలిస్తుండగా విజిలెన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లారీతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాలివి.. కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి దెందులూరు మండలం దోసపాడులోని రైస్‌మిల్లుకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని విజిలెన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం వచ్చింది. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి నిఘా పెట్టారు. ఆదివారం తెల్లవా రుజామున పెదవేగి మండలం ముండూరు సమీపంలో పోలవరం కాలువ దగ్గర అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని తనిఖీ చేయగా అందులో 4,300 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు వాటిని పెదవేగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తడికలపూడికి చెందిన వ్యాపారి ఈడ్పుగంటి శ్రీనివాస్ అనేవ్యక్తి ఆ బియ్యాన్ని దెందులూరు మండలం దోసపాడులో బాలినేని తేజ అనే వ్యక్తికి చెందిన రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు గుర్తించి, ఈడ్పుగంటి శ్రీనివాస్, బాలినేని తేజ, లారీ డ్రైవర్‌లపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. వీటి బియ్యం విలువ రూ.1.72లక్షలు కాగా లారీ విలువ రూ.4లక్షలని ఆయన చెప్పారు. దాడిలో పౌరసరఫరాలశాఖ డీటీ రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను దండించిన వార్డెన్ భార్య



వార్డెన్ ఇంటి నుంచి హాస్టల్‌కు వెళుతున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) దండిస్తున్న వార్డెన్ భార్య

ఆకివీడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో విద్యార్థులు అల్లరి చేస్తుండడంతో వార్డెన్ ఇంటికి తీసుకెళ్లగా భార్య దండించిన ఘటన ఆదివారం జరిగింది. ఆకివీడు ఎస్సీ బాలురు వసతి గృహంలో ఇరవై మంది పైబడి విద్యార్థులు ఉంటున్నారు. వార్డెన్ ఫణికి చెవుడు ఉండడంతో మిషన్ పెట్టుకున్నప్పటికీ అంతంత మాత్రమే విన్పిస్తుంది. ఇటీవల ఓ విద్యార్థి బాల్ కోసం మేడపైకి వెళ్లి అక్కడ నుంచి పడిపోవడంతో చేతి వద్ద తెగడంతో కుట్లుపడ్డాయి. శనివారం మరోసారి విద్యార్థులు మేడపైకి ఎక్కడంతో విద్యార్థులకు చెప్పినప్పటికీ ప్రవర్తనలో మార్పు రావడం లేదని, కిలోమీటరు దూరంలో అద్దెకు ఉంటున్న వార్డెన్ నివాసానికి శనివారం మొత్తం విద్యార్థులను తీసుకెళ్లారు. అక్కడ వార్డెన్ భార్య విద్యార్థులను చేతితో దండించినట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఈ ఘటనపై బ్యాంకు మాజీ ఉద్యోగి ఎం.రామిరెడ్డి సంబంధిత వీడియోలు స్థానిక అధికారులతో పాటు జేసీ, కలెక్టర్‌కు పంపించారు. ఈ ఘటనపై స్పందించిన ఏఎస్‌డబ్ల్యూవో శీలం రాజశేఖర్‌రెడ్డి ఆదివారం హాస్టల్‌కు వచ్చి విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

హైవేపై మోటారు సైకిల్ దగ్ధం



దగ్ధమైన స్కూటర్

ఏలూరు క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై సుజికీ యాక్సెస్ 125 స్కూటర్‌పై ఇద్దరు యువకులు వెళ్తుండగా అకస్మాత్తుగా ఇంజన్ ఆగిపోయింది. ఇంజన్ నుంచి పొగలు, మంటలు రావడంతో యువకులు అప్రమత్తమై ఆపి దిగిపోయారు. పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన మెడంకి ఏసుపాదం 2021లో స్కూటర్‌ను కొనుగోలు చేశారు. ఆయన కుమారుడు, మరో స్నేహితుడు కలిసి ఆదివారం ఉదయం అమ్మపాలెం నుంచి ఏలూరు వెళ్తుండగా మెయిన్‌బైపాస్ చుట్టుగుంట బ్రిడ్జివద్దకు వచ్చేసరికి అకస్మా త్తుగా ఇంజన్ ఆగిపోయి పొగలు, మంటలు రావడంతో వారిద్దరు దిగిపోయారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఏలూరు ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఫైర్‌ఇంజన్‌తో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే ఆ స్కూటర్ పూర్తిగా దగ్ధమైంది. ఏ కారణం చేత దగ్ధమైందో తెలియని పరిస్థితి. షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రమాదం సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆ స్కూటర్‌కు ఇన్సూరెన్సు లేనట్టు తెలుస్తుంది. ఇద్దరు యువకులు ప్రమాదం నుంచి బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆశ్రమ పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

పోలవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): చేగొండపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ముచ్చిక రంజిత్ కుమార్‌దొర ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. హాస్టల్ విద్యార్థులకు క్షవరాలు చేయించి, గోళ్లు కట్ చేయించి సబ్బులు శాంపూలు, గొడుగులు, చెప్పులు ఉచితంగా అందజేశారు. 2012 నుంచి ఇదే విధంగా నియోజకవర్గంలో అన్ని మండలాల్లో దుప్పట్లు పుస్తకాలు వేరుశెనగ చిక్కీలు అందించి సహాయ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

గడ్డర్ తొలగించడంపై పోలీసులకు ఫిర్యాదు

ఉంగుటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): నారాయణపురం వంతెన శిథిలావస్థకు చేరడంతో గ్రామంలోకి వస్తున్న భారీ వాహనాలను అడ్డుకోవాలనే తలంపుతో శనివారం ఇనుప గడ్డర్‌ను ఏర్పాటు చేశారు. అయితే అర్ధరాత్రి సమయం లో గుర్తుతెలియని వ్యక్తులు వాటిని తొలగించి పక్కన పడేశారు. గ్రామంలో సంఘ విద్రోహ శక్తులు తొలగించారని పోలీసుల సూచనలతోనే గడ్డర్లు ఏర్పాటు చేశామని సర్పంచ్ భర్త దిడ్ల శ్రీను వివరించారు. ఈ విషయమై చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్యభగవాన్ దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

మాకా స్కూల్ టీచరుపై దాడి అవాస్తవం

ఏలూరు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి):నగరంలోని మౌలానా అబుల్‌కలాం అజాద్(మాకా) మున్సిపల్ ఉర్దూ హైస్కూల్ తరగతి గదిలో గత శుక్రవారం ఒక ఉపాధ్యాయురాలి పట్ల అల్లరిమూకలు అభ్యంతరకరంగా ప్రవర్తించాయన్న ఆరోపణల్లో నిజం లేదని 45వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, మరికొందరు ముస్లిం పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. స్కూల్లో ఉర్దూ మాధ్యమంలో బోధించాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే చదవాలని విద్యార్థులపై అక్కడి ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తుండటం, ఆ మేరకు తల్లిదండ్రులతో సంతకాలు చేయిస్తుండటంపై అభ్యంతరం తెలియజేసి, హెచ్ఎంకు వినతిపత్రాన్ని ఇచ్చేందుకు స్థానిక పెద్దలు వెళ్లారని వివరించారు. కాగా స్కూల్లో విధి నిర్వహణలో ఉన్న ఓ టీచరుపై దాడి జరిగిందనే ఆరోపణలను ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నాయకులు ఖండిస్తూ శనివారం ఒక ప్రకటనను విడుదల చేసిన విషయం విదితమే.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

శ్రీవారి సేవలో ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు



ద్వారకాతిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి):ఏఎంసీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన యద్దనపూడి బ్రహ్మరాజు కుటుంబ సమేతంగా ఆదివారం చినవెంకన్నను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఆలయం వద్ద టీడీపీ సీనియర్ నేత మొగతడకల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీరమణి, ఓం ప్రకాశ్ చౌదరిలు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఏఈవో పి.నటరాజారావు స్వామివారి మెమెంటో అందించారు.

మానవత నూతన మండలాధ్యక్షుడిగా రామచంద్రరావు



పోలవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం సంస్థ పెద్దల ఆధ్వర్యంలో జరిగింది. నూతన మండలాధ్యక్షుడిగా కోటమరాజు రామచంద్రరావు ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులు సమావేశమై భవిష్యత్ సేవా కార్యక్రమాలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరచాలని సంకల్పించారు. ఉపాధ్యక్షులు గోళ్ళ చంద్రశేఖర్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, సిద్ధా కృష్ణమూర్తి, ఎస్‌వి నారాయణ, నరసింహమూర్తి, బి.అలివేలు, షెహినా బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక ఆపస్ కార్యాలయంలో ఆ సంఘ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఆప్షనల్ హాలీడేలను ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి ఇవ్వాలని కోరారు. మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌లో డాక్యుమెంటేషన్, ఫొటోలు అప్లోడ్ చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఉండాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, సెలవులను ఆన్‌లైన్‌లో అప్లై చేయడానికి ఉదయం ఏడు గంటలలోపే అప్లోడ్ చేయాలనడం సరికాదని, తొమ్మిది గంటల వరకు సమయం పెంచాలన్నారు. ఆపస్ నాయకులు జి.గణపతి, గడ్డి నాగేశ్వరరావు, బి.వి.ఎస్. సూర్యనారాయణ, బి.ఎస్. సాయిబాబా, రవీంద్రబాబు, మహేశ్వరరావు, వేదాంత్ కుమార్, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ఆటోలు ట్రాఫిక్ క్లియరెన్స్ నెంబర్ తీసుకోవాలి



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్

ఏలూరు క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆటో ఓనర్లు, డ్రైవర్లు ట్రాఫిక్ పోలీస్ అధికారుల వద్ద నుంచి పోలీస్ క్లియరెన్స్ నెంబర్‌ను పొందాలని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు సూచించారు. ట్రాఫిక్ క్లియరెన్స్ నెంబర్ పొందాలంటే ధృవపత్రాలను తప్పనిసరిగా ట్రాఫిక్ పోలీసులకు అందించి నెంబర్ తీసుకోవాలన్నారు. ఆటో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సి), పర్మిట్ సర్టిఫిక్ (పిసి), ఫిట్‌నెస్ సర్టిఫికెట్ 9 (ఎఫ్‌సి), ఇన్సూరెన్సు సర్టిఫికెట్ (ఐసీ), పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పియుసి), డ్రైవింగ్ లైసెన్సు (డ్రైవర్ అండ్ ఓనర్) ఈ పత్రాలు అన్నీ ప్రభుత్వ పరంగా చెల్లుబాటు అయ్యేవిధంగా ఫోర్సులో ఉండాలన్నారు. ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పించినా, అసలు కాని నకిలీ వివరాలు అందించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు హెచ్చరించారు. సాధారణ ప్రజల భద్రత, సరైన రవాణా వ్యవస్థ నిర్వహణ, ట్రాఫిక్ నియామాల అమలు కోసం ఈ చర్యలు తీసుకుంటామని, అంతా సహకరించాలని సూచించారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు రుజువు చేయండి : టీడీపీ

చింతలపూడి, జూలై 6(ఆంధ్రజ్యోతి) :ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌పై చేస్తున్న ఆరోపణలు రుజువు చేస్తే రా జకీయాల నుంచి తప్పుకుంటామని ఏఎంసీ మాజీ అధ్య క్షులు, టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనుక షాడోలు ఉన్నారని, సీనియర్లను దగ్గరకు రానివ్వడంలేదని, భూ ఆక్రమణలు చేస్తున్నారని, ప్రజలకు అందుబాటులో ఉండడంలేదని చేసిన ఆరోపణలను ఖండించారు. అసత్య ఆరోపణలు చేసేవారిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో లింగపాలెం మండల నాయకులు చలపతి రావు, దళిత నాయకులు బోడా నాగభూషణం, పట్టణ నాయకులు టి.అప్పారావు, సి.హెచ్.ధర్మరాజు, మాజీ ఎంపీటీసీ కె.రాజారెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు, దేవ పాల్గొన్నారు.

సుభద్రా, బలభద్ర, జగన్నాథులకు సారె

ద్వారకాతిరుమల, జూలై6(ఆంధ్రజ్యోతి):పురాతన లక్ష్మీపురం ఆలయంలో కొలువైన సుభద్రా, బలభద్ర, జగన్నాథులకు తిమ్మాపురం గ్రామస్థులు ఆదివారం ఉదయం సారెను సమర్పించారు. తూంపాటి పద్మవర ప్రసాద్, గరిమెళ్ల మురళి, పోలిన బాలు, వాసిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులు, మహిళలు వీటిని అందజేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ సారెను సమర్పించినట్టు భక్తులు తెలిపారు.

చోటెవరికి..?

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. వివాదాలకు తావులేకుండా పార్టీకి అణుకువగా ఉన్నారు. ఈ క్రమంలోనే నర్సాపురం లోకసభ స్థానం నుంచి శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నా, అదే నియోజకవర్గ పరిధిలో ఉన్న పాకాను ఈ మధ్యనే రాజ్యసభకు ఎంపిక చేశారు. ఈ నిర్ణయం వెనుక సామాజిక సమతుల్యం, పార్టీ కోసం ఎవరైతే కష్టపడతారో వారికే ప్రమోషన్లు ఉంటాయని బీజేపీ చెప్పకనే చెప్పింది. పార్టీలో ఒకనాడు ఉమ్మడి పశ్చిమ అధ్యక్షుడిగా పనిచేసిన పాకా అంచెలంచెలుగా రాష్ట్ర కమిటీలో క్రమశిక్షణా సంఘం చైర్మన్ స్థాయికి ఎదిగారు. ఇదంతా పార్టీ ఆచితూచి తీసుకున్న నిర్ణయం. ఇలాంటి సందర్భంలోనే పీవీ మాధవ్ అధ్యక్షతన పార్టీ మరింత దూసుకెళ్లాలంటే సీనియర్లతో పాటు మరికొంతమంది చురుకైన వారికి అవకాశం కల్పించే దిశగానే కసరత్తు జరుగుతుందా, లేదా అనే సందేహాలు పార్టీలో వినిపిస్తున్నాయి. బీజేపీ ఆది నుంచి పార్టీ రాష్ట్రకార్యవర్గంలో సామాజిక, ప్రాంతీయ సమతుల్యత కల్పిస్తూనే వచ్చింది. పదిమంది రాష్ట్ర కార్యదర్శుల్లో ఇంతకుముందు ప్రస్తుత కేంద్ర మంత్రి వర్మ కొనసాగారు. ఐదుగురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల్లో ఏలూరుకు చెందిన తపన చౌదరి ఒకరుగా ఉన్నారు.



వాసవీ మాత సన్నిధిలో రెడ్డి అప్పలనాయుడు



భూలోకమ్మకు సారె అందజేస్తున్న భక్తులు



పారిజాతగిరిపై ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే చిర్రి



పాటిమ్మతల్లిని దర్శించుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

అమ్మవార్లకు సారెలు సమర్పించిన భక్తులు

ఏలూరుకార్పొరేషన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం నగరంలోని దేవాలయాలన్నీ భక్తులతో, పూజలు, వ్రతాలతో కిటకిటలాడాయి. ఈ మేరకు పాత బస్టాండ్ సెంటర్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో భక్తులు సామూహికంగా రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపారు. స్వామివారి సన్నిధిలో శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు దండిబొట్ల కనకసుందర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆలయ ఈవో సి.హెచ్. చిననాగేశ్వరరావు బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. బావిశెట్టివారిపేటలోని శ్రీభూలోకమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు సామూహికంగా 108రకాల పిండి వంటతో మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఊరేగింపు జరిపి అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఆలయ చైర్మన్ ఇమంది చంద్రశేఖర్, కార్యదర్శి వెంపల అనీల్, కోశాధికారి పప్పు రాంబాబు, సహాయ కార్యదర్శులు నాగులపల్లి గంగాధరరావు, లంకలపల్లి సతీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంకబత్తుల రమేశ్, కార్యవర్గ సభ్యులు బసవ పురుషోత్తం, పిట్ల సంతోష్, కత్తిరి దుర్గారావు, మిత్ర బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. అంబికా ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘ వేంద్రశర్మ ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో సామూహికంగా రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను జరిపించారు.పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయంలో భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్లబండ ఆదినారాయణ శర్మ భక్తులతో అర్చనలు జరిపించారు. వారి గోత్రనామాలతో పూజలు జరిపారు. ఆలయ చైర్మన్ కోరాడరెడ్డి, బూరాడ పూర్ణచంద్రరావు మిత్రబృందం భ క్తులకు తగు ఏర్పాట్లు చేశారు. కైకరం వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అమ్మవార్లకు సారెను అందించి విశేష పూజలు నిర్వహించారు.

● పోలవరం: పట్టిసీమ శివక్షేత్రం క్షేత్ర పాలకుడు భావన్నారాయణ స్వామికి, పోలవరం మండల కేంద్రంలో స్థానిక పాండురంగడి కొండపై ఉన్న పాండురంగడి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పోలవరం చేరుకుని కొండపైకి 105 మెట్లు ఎక్కి ఆలయానికి వచ్చి దర్శనాలు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంశ పారంపర్య ధర్మకర్తలు ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ మహిళలు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి క్షేత్రపాలకుడైన భావన్నారాయణ స్వామికి పూజలు నిర్వహించారు.

● దెందులూరు : చల్లచింతలపూడి, పెరుగుగూడెం, తిమ్మనగూడెం గ్రామాల మధ్య కొలువైన శ్రీపాటిమ్మ తల్లి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. పెరుగుగూడెం మాజీ సర్పంచ్, పాటిమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతులు ఆషాఢం సారెను పాటిమ్మతల్లికి అందజేశారు. దెందులూరులోని జాతీయ రహదారి పక్కన ఉన్న కనకదుర్గమ్మకు ఆషాఢం సారెను రామదండు ఆధ్వర్యంలో 108 మంది ముత్తైదువులతో కలిసి అందజేశారు. రామదండు సభ్యులు సుగ్గిశెట్టి నూకరాజు, మోటపర్తి రాజా పాల్గొన్నారు.

● పెదపాడు: పెదపాడులో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పూజలనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● చింతలపూడి: పాతబస్టాండ్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ నిర్వాహకులు గ్రామదేవత ముత్యాలమ్మ దేవతకు ఆషాఢ మాసం సారెను సమర్పించారు. గత రెండేళ్లుగా చేపడుతున్నట్టు నిర్వాహకులు కొత్తపూడి శేషగిరిరావు తెలిపారు.

● ఏలూరు రూరల్ : ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, తూర్పు వీధి గంగానమ్మ తల్లికి ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ మాతకు ఆర్యవైశ్య మహిళలు భక్తిపూర్వకంగా ఆషాఢం సారెను సమర్పించారు. శాకాంబరీ అలంకారంతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు చేక్కా రాజారావు, చలువాది శివకృష్ణ, బ్రహ్మయ్య, నంగులూరి సత్యనారాయణ, నున్న శ్రీనివాసరావు, మద్దుల పవన్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం గంగానమ్మను దర్శించుకున్నారు.

● ఉంగుటూరు : తొలి ఏకాదశి సందర్భంగా కైకరం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి వైభవంలను గీతామృత వాహిని సత్సంగ్, సీతారామ గీతార్చన సత్సంగం నిర్వహించారు. ఆలయ అర్చకులు కిరణ్ ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కీర్తలను ఆలపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బూసా భాస్కరరావు ఆధ్వర్యంలో వేంకటేశ్వర వైభవం కీర్తలను ఆలపించారు. గీతామృత వాహిని సత్సంగ్ అధ్యక్షులు కొచ్చర్లకోట శ్రీనివాసరావు నాయకత్వం వహించారు.

● కామవరపుకోట: లక్ష్మీహయగ్రీవ లలితా శ్రీపీఠంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులతో పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. కొత్తూరులోని గంగానమ్మ, కనకదుర్గమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు గ్రామస్థులు పిండి వంటలతో మేళతాళాలతో పసుపు, కుంకుమలతో ప్రదర్శన జరిపి అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించారు.

● జంగారెడ్డిగూడెం: తొలిఏకాదశి సందర్భంగా పట్టణంలో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవెంకటేశ్వరస్వామిని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈఓ కలగర శ్రీనివాస్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలకగా ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆశీస్సులందించారు.

పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు తప్పకుండా వేయించాలి

ఏలూరుటూటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి సోకకుండా తప్పని సరిగా వ్యాక్సిన్ వేయించాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.గోవిందరాజు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని జిల్లాలో పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు రాబీస్‌వ్యాధి సోకకుండా వ్యాక్సీన్లు వేశారు. ఏలూరు పశువుల ఆసుపత్రిలో జేడీ డాక్టర్ గోవిందరాజు కుక్కలకు వ్యాక్సీన్ వేశారు. ప్రతి ఏటా కుక్కలకు రాబీస్ వ్యాధి సోకకుండా వ్యాక్సీన్ వేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 25వేల 300 వ్యాక్సీన్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని 11 ప్రాంతీయ వైద్యశాలలు, 66 డిస్పెన్సరీలు, 57 పశువైద్య శాలల్లో ఆదివారం ర్యాబిస్ వ్యాధి టీకాలు వేశామన్నారు. వాక్సీన్లు వేయించుకోనివారు. ఏలూరు పశు వైద్య శాలలో 315 కుక్కలకు వ్యాక్సీన్ వేసినట్లు అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ డి.సుబ్రహ్మణ్యం తెలిపారు.



టీకాలు వేయిస్తున్న లయన్స్ సభ్యులు

● చింతలపూడి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెటర్నరీ హాస్పటల్ వద్ద జూనోసిస్ డే సందర్భంగా జంతువులకు టీకాలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు అడపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలన్నారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ జి.ధనలక్ష్మి, మండల పశువైద్యాధికారి బి.శివనాగేంద్రబాబు, డాక్టర్ బి.తేజశ్రీ, సిబ్బంది, లయన్స్ సభ్యులు రామకృష్ణ, రాజగోపాల్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ప్రపంచ సంక్రమిత వ్యాధుల నివారణ దినం సందర్భంగా ఆదివారం పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ డాక్టర్ ఎన్.వి.శేఖర్ దొర తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులు, మనుషులకు చికిత్స లేదని మరణం తప్పదన్నారు. లక్కవరం పశువైద్యాధికారి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

● భీమడోలు: ప్రపంచ జూనోసిస్ డే పురస్కరించుకుని పూళ్ల పశువైద్యశాలలో కుక్కలకు ఉచిత ర్యాబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. పూళ్ళ సర్పంచ్ దాయం సుజాత పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మత విద్వేషాలు రగిలిస్తూ రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్ దాడి

సీపీఐ జిల్లా మహాసభల్లో అక్కినేని వనజ



సమావేశాల్లో మాట్లాడుతున్న అక్కినేని వనజ

చింతలపూడి, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలిస్తూ రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్ దాడి చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభల్లో భాగంగా ఎర్రగుంటపల్లి రాధా గార్డెన్స్‌లో కారుమూడి సత్యనారాయణరెడ్డి ప్రాంగణంలో బత్తుల వెంకటేశ్వరరావు వేదికపై రెండవ రోజు ప్రతినిధుల సభ జరిగింది. వేదికపై ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పేదల హక్కులను నాశనం చేయాలన్న ప్రయత్నంలో భాగంగానే ఈ విధమైన దుశ్చర్యలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి మహాసభలు చేసే తీర్మానాలన్నీ నెరవేర్చే వరకు సీపీఐ శ్రేణులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పనిచేయాలన్నారు. ప్రతినిధుల సభలో ప్రజా నాట్య మండలి సభ్యులు పిచ్చయ్య, అలెగ్జాండర్, లెనిన్, ముళ్ళగిరి లాజర్ ఆలపించిన విప్లవ గేయాలు సభలో ఆకట్టుకున్నాయి. బండి వెంకటేశ్వరరావు, ఎం.వసంతరావు, టి.బాబు, కంచర్ల గురవయ్య, వరక శ్యామల, ఎం.డి.మునీర్, వెంకట్రావు, యామిని పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ సుపరిపాలన

పోలవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : కొత్తపట్టిసీమ గ్రామంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల పరిశీలకులు కిలారి సత్యనారాయణ, డోకల నాగేశ్వరరావు, పెద్దేహపు వీరవెంకటసత్యనారాయణ, నునకాని రాంబాబు, రంభ సుబ్బారావు, ఏనుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందని టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు అన్నారు.అన్ని గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి పనులను చేపడుతున్నారని, పేదలకు అనేక సంక్షేమపథకాలు అందిస్తున్నారన్నారు. పాతూరి శ్రీనివాసరావు, మొరంపూడి వరప్రసాద్, వేంపాటి ప్రసాద్, గారపాటి సాయి, వెంకటేశ్వరరావు, సి.హెచ్. రామ్మోహన్‌రావు, నాగులు, పఠాన్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: 27వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పట్టణ నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. టీడీపీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామకుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేయడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఇళ్ళకు వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. చేను ప్రసాద్, కోటగిరి ప్రమీల, చిట్టూరి బాపినీడు, కన్నా శ్రీదేవి, కొత్తూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని వేగవరంలో గ్రామాధ్యక్షుడు ఆలపాటి దుర్గారామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, బలుసు కిరణ్ కుమార్, బల్లే సత్యనారాయణ, లక్కాబత్తుల స్వామి, కొప్పుల రాంబాబు, షేక్ పెంటూసాహెబ్, యన్నమనేని శ్రీనివాసరావు, టి.వీరబాబు, జి.అన్నవరం పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న బొరగం శ్రీనివాసులు

● ఉంగుటూరు: ప్రజలకు మంచి చేసి వారి ముందుకు వెళ్తున్నామని టీడీపీ మండలాధ్యక్షులు వేములపల్లి సుధీర్ పేర్కొన్నారు. ఆదివారం ఉంగుటూరులో సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతు నాయకులు ఇమ్మణ్ణి గంగాధరరావు, బండారు మధు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బహుముఖ ప్రజ్ఞాశాలి శ్యామ్‌ప్రసాద్

ఏలూరు,జూలై 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బహుముఖ ప్రజ్ఞాశాలిని అని పలువురు వక్తలు కొనియాడారు. బీజేపీ ఏలూరు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అధ్యక్షతన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 124 జయంతిని ఆదివారం నిర్వహించారు. నేతలు లక్కోజు అనిల్, పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, కన్వీనర్లు గాది రాంబాబు, బాడిత నారాయణరావు, మండల అధ్యక్షులు నగరంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఏలూరు,జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని తూర్పు వీధి ఫిలాస్‌పేటలో రామ్ విగ్రహం వద్ద ఆదివారం బీజేపీయువ నాయకులు ప్రక్కి మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిశోర్ హాజరై మాట్లాడుతూ ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగం శివ, బిజెపీ పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు జుజ్జవరపు ప్రతాప్, తూర్పు మండలాధ్యక్షులు పల్లంట్ల జ్యోతికుమార్, సీనియర్ నాయకులు పి.మనోహర్ ప్రసాద్ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఆదివారం ఏలూరు వైసీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాశ్ పాల్గొని మాట్లాడుతూ భారత రాజకీయ వ్యవస్థలో అరుదైన ముద్ర వేసుకున్న వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని అన్నారు. పార్టీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనపకూరి జగదీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, నేరుసు చిరంజీవి, జాన్ గురునాథ్, కిలాడీ దుర్గారావు, విజయనిర్మల, పల్లి శ్రీనివాసు పాల్గొన్నారు.

● భీమడోలు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి పోలసానిపల్లిలో నిర్వహించారు. సర్పంచ్ షేక్ హసీనా రహీమాబేగం జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవల్ని కొనియాడారు. బి రామకృష్ణ, శ్యామ్‌రాజు, బొబ్బా బాలాజీ, పెద్దిరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

ఏలూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి):ఏలూరు రూరల్ మండల పరిధిలోని మానూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేరా ప్రసాద్ ఆధ్వర్యంలో కాటూరి బల్తజార్ మాతృమూర్తి సౌభాగ్యం పేరు మీద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బల్తజార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. హెచ్ఎం మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు. కె.గాస్పెల్, మరియదాసు, దేవసుందరం, బాలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, జూలై 6(ఆంధ్రజ్యోతి):చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను ప్రతి రోజూ హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి ఐషర్, బొలేరో వాహనాల్లో తరలిస్తున్నారని, దీని వల్ల నీటి కాలుష్యంతో పాటుగా పర్యావరణం కాలుష్యం అధికమవుతుందనే పలు ఫిర్యాదులు అందుతుండటంతో సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు. సిబ్బందితో కలిసి ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రెండు వాహనాలు పట్టుబడ్డాయన్నారు. వాహనాలను, వాటిల్లోని సుమారు 20 వేల కిలో చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని, వాహన యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్టు ఎస్సై కట్టా శారద సతీష్ చెప్పారు.



విద్యార్థులకు నీతి కథల బోధన

పెదవేగి, జూలై 6(ఆంధ్రజ్యోతి):తరచుగా గ్రంథాలయానికి వెళ్తుంటే అది విజ్ఞానానికి బాట అవుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు చిట్టూరి గంగాధరరావు అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కథలు వినిపించి, వాటిలో నీతిని బోధించారు. గ్రంథపాలకుడు గంగాధరరావు మాట్లాడుతూ గ్రంథపఠనం విద్యార్థి ఔన్నత్యానికి దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

పెదపాడు, జూలై6(ఆంధ్రజ్యోతి): నాయుడుగూడెం గ్రామానికి చెందిన సుష్మ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వల్లూరి వెంకటకృష్ణయ్య పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. పెదపాడు గ్రామానికి చెందిన దొండపాటి దివ్య జ్యోస్న అమ్మమ్మ సంరక్షణలో ఉంటూ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. కళాశాలకు రెండేళ్ల ఫీజు బకాయి నిమిత్తం రూ.40 వేలను సంస్థ తరఫున అందజేశారు. వల్లూరి సుభద్రా దేవి పాల్గొన్నారు.

దేవస్థానం సిబ్బందికి ఉచిత వైద్యం

ద్వారకాతిరుమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆలయ హరిణి కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఆలయ సిబ్బంది కోసం ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో దాదాపు 200 మంది పైబడి ఆలయ సిబ్బంది వైద్యులు పి.రితేశ్ గుండె పరీక్షలు, 160 మందికి తేజస్వి కంటి పరీక్షలు చేశారు. పలువురికి ఈసీజీ, ఏకో పరీక్షలు చేసి మందులను అందించారు. బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. డిప్యూటీ ఈవో భద్రాజీ, దేవస్థానం వైద్యులు ఆర్.రాజేంద్ర ప్రసాద్, దాస్యం ప్రసాద్, ఏఈవోలు నటరాజా రావు, రమణరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దర్గాకు ముస్లింల యాత్ర

పోలవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సముద్రం ఒడ్డున ఉన్న బారాషహీద్ దర్గాకు పోలవరం అహెలె సున్నత్ జమాతే మస్జీద్ ముస్లింలు ఆదివారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. కొంతమంది ముస్లింలు రైళ్లలో ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి ఉపవాసాలు పాటిస్తూ భక్తి శ్రద్ధలతో మసీదులో నమాజులు నిర్వహించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

జీలుగుమిల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి) : పిచ్చి కుక్క దాడిలో గాయాలపాలైన వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరామర్శించారు. ఆస్పత్రిలో చేరిన వారికి సరైన వైద్య సేవలు అందించడం లేదని బాధిత కుటుంబీకులు ఎమ్మెల్యేకు సమాచారం ఇచ్చారు.దీంతో ఎమ్మెల్యే వారిని ఆస్పత్రిలో పరామర్శించారు. వారికి అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బేబీ కమలతో చర్చించారు. పిచ్చికుక్క దాడిలో గాయాలపాలైన వారిపై సరైన శ్రద్ధ చూపించలేదని, బాధితులకు సరైన వైద్య సేవలందించడంలో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం తగదన్నారు.

పారిశుధ్య మేస్త్రీపై చర్యలు తీసుకోవాలి

ఏలూరుటూటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో పారిశుధ్య మేస్త్రీగా పని చేస్తున్న ఉమామహేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు సునీల్ కుమార్ డిమాండ్ చేశారు.పారిశుధ్య కార్మికురాలు బి.మల్లేశ్వరిని వేధిస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉమామహేశ్వరరావును విధుల నుంచి తాత్కాలికంగా తప్పించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అయితే నగర పాలక సంస్థ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేకాటలో నలుగురి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : కోడేలు జగనన్న కాలనీలో పేకాడుతున్నట్టు ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.5,900 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కైకలూరు పశువైద్యశాలలో
కుక్కలకు వ్యాక్సిన్ వేస్తూ

పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి

కైకలూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు ప్రతి ఏటా తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యశాఖ ఏడీఏ డాక్టర్ పి. ముస్తాఫాఖాన్ అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా కైకలూరు, కలిదిండి మండలాల్లో 241 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మరో మూడు రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పెంపుడు జంతువులు ఉన్న వారు దగ్గర్లోని పశువుల ఆసుపత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. పశువైద్యాధికారులు లీలా ఉషారాణి, అబ్దుల్ గని, జయరాం, లోకేశ్, గంగాధర్, మనోజ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడు: పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి రమేష్, నూజివీడు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కే నరసింహరావు పశువైద్యశాలలో 126 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం డాక్టర్ రమేష్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకి సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులంటారని ఈ వ్యాధుల పట్ల పెంపుడుకుక్కల, పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ కే నరసింహరావు మాట్లాడుతూ మొదటగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసిన తరువాత 30 రోజుల తరువాత బూస్టర్ డోస్ వేయించాలని తర్వాత సంవత్సరానికి ఒకసారి ప్రతీ ఏటా ఒక డోస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు ప్రాంతీయ వైద్యశాల డాక్టర్ దినేష్, డాక్టర్ హరికృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ అధ్యక్షుడు కె. ప్రసాద్, అడిషనల్ సెక్రటరీ సాయి పాల్గొన్నారు.

కలిదిండి: కోరుకొల్లు పశు వైద్యశాలల్లో ఆదివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు ప్రహర్ష, ఫణీంద్ర మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబీస్ వ్యాక్సిన్లు వేయించాలని పొరపాటున పెంపుడు కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకి చనిపోయే ప్రమాదం ఉందన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



కలిదిండి, జూలై 6 (ఆంధ్ర జ్యోతి): ఏకలవ్యుడి గురు భక్తి, ఏకాగ్రత, త్యాగనిరతి నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మండల ఏకలవ్య సంఘం అధ్యక్షుడు కుంబా నాగరాజు అన్నారు. ఏకలవ్య జయంతి సందర్భంగా కలిదిండిలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ. లక్ష విరాళం



దాత కుటుంబానికి బాండు అందజేస్తున్న డిప్యూటీ ఈఓ భద్రాజీ

ద్వారకాతిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న గో సంరక్షణ ట్రస్టుకు ముసునూరు మండలం సూరేపల్లి వాస్తవ్యులు వడ్లపట్ల గాంధీ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ డిప్యూటీ ఈవో భద్రాజీకి అందజేశారు. దాతకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించగా సూపరింటెండెంట్ కిషోర్ బాండును అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



చాట్రాయి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోటపాడు గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని విగ్రహదాత మరుమూడి థామస్ ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు వర్గాలకు కూడా అంది దేశం సుసంపన్నం కావాలని అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేశారని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళడానికి భారతీయులు పునరంకితం కావాలని కోరారు. నూజివీడు నియోజకవర్గ మ్లయోధుల సంఘం నాయకుడు నక్కా రాము, మండల నాయకులు విజయరాజు, బ్రహ్మయ్య, అనిల్‌కుమార్, గుడిమళ్ళ జయరాజు, మంగా జయరాజు, కోటపాడు యువకులు పాల్గొన్నారు.

కాలువలో చెత్త తొలగింపు పనుల పరిశీలన



కైకలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో చెత్తను పూర్తి స్థాయిలో తొలగించి ప్రజలకు సురక్షిత తాగు నీరు అందిస్తామని డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. ఆదివారం ఆచవరంలో కైకలూరు పంటకాలువలోని చెత్తతొలగింపు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలకు నీరు విడుదల చేశామని కాలువల్లోని గుర్రపుడెక్క, చెత్తను ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో చెత్తను తొలగించి నీటిపారుద్రలకు అవరోధం లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచనల మేరకు ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎక్కడికక్కడ పనులు చేపట్టామన్నారు. ఇరిగేషన్ అధికారులు ముదునూరు కొండరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోటెవరికి..?

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. వివాదాలకు తావులేకుండా పార్టీకి అణుకువగా ఉన్నారు. ఈ క్రమంలోనే నర్సాపురం లోకసభ స్థానం నుంచి శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నా, అదే నియోజకవర్గ పరిధిలో ఉన్న పాకాను ఈ మధ్యనే రాజ్యసభకు ఎంపిక చేశారు. ఈ నిర్ణయం వెనుక సామాజిక సమతుల్యం, పార్టీ కోసం ఎవరైతే కష్టపడతారో వారికే ప్రమోషన్లు ఉంటాయని బీజేపీ చెప్పకనే చెప్పింది. పార్టీలో ఒకనాడు ఉమ్మడి పశ్చిమ అధ్యక్షుడిగా పనిచేసిన పాకా అంచెలంచెలుగా రాష్ట్ర కమిటీలో క్రమశిక్షణా సంఘం చైర్మన్ స్థాయికి ఎదిగారు. ఇదంతా పార్టీ ఆచితూచి తీసుకున్న నిర్ణయం. ఇలాంటి సందర్భంలోనే పీవీ మాధవ్ అధ్యక్షతన పార్టీ మరింత దూసుకెళ్లాలంటే సీనియర్లతో పాటు మరికొంతమంది చురుకైన వారికి అవకాశం కల్పించే దిశగానే కసరత్తు జరుగుతుందా, లేదా అనే సందేహాలు పార్టీలో వినిపిస్తున్నాయి. బీజేపీ ఆది నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో సామాజిక, ప్రాంతీయ సమతుల్యత కల్పిస్తూనే వచ్చింది. పదిమంది రాష్ట్ర కార్యదర్శుల్లో ఇంతకుముందు ప్రస్తుత కేంద్రమంత్రి వర్మ కొనసాగారు. ఐదుగురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల్లో ఏలూరుకు చెందిన తపనా చౌదరి ఒకరుగా ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

నరసాపురానికి బస్సు నడపాలని ఎమ్మెల్యేకు వినతి

కలిదిండి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాలకు నరసాపురం డిపో బస్సు నడపాలని కలిదిండి మండల కూటమి నాయకులు ఆదివారం నరసాపురంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలసి విన్నవించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు నాగిడి వీరబ్రహ్మం, తెలుగు యువత ఉపాధ్యక్షులు దుగ్గిరాల పరమేశ్వరరావు, దున్న భోగేశ్వరరావు, పోకల శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.

బురద కయ్యగా అంతర్గత రహదారులు



నూజివీడు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్త డ్రెయినేజీల కారణంగా నూజివీడు మండలం అన్నవరం శివారు వెంకటాద్రిపురం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో కాలంగా డ్రెయినేజీ పూడుకుపోవడంతో వర్షం పడిన సందర్భాల్లో రహదారుల బురద కయ్యగా మారుతున్నాయి. వర్షాలకు వాన నీరు బయటకు పోయే మార్గం లేక మురుగునీటితో కలసి రహదారులపై నిలిచిపోతోంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యథేచ్ఛగా కొండ చిలువల సంచారం



కలిదిండి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరు వెంబడి ఉన్న మద్వాని గూడెం- పెదలంక రహదారిపై కొండ చిలువలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళలో గ్రామాల్లో ఇళ్లలోకి రావటంతో మహిళలు, పిల్లలు హడలి పోతున్నారు. చేపలు, రొయ్యల చెరువు గట్లపై కూడా సంచరిస్తుండటంతో రాత్రి వేళలో చెరువుల వద్దకు వెళ్లటానికి రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఉప్పుటేరు వెంబడి పొదల్లో నుంచి గ్రామాల్లోకి వస్తున్నాయని పలువురు మత్స్యకారులు తెలిపారు. ఉప్పుటేరులో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల వలలో పలుమార్లు చిక్కాయని తెలిపారు. ఇటీవల మట్టగుంటలో రహదారిపై కొండచిలువ సంచరిస్తూ గ్రామస్థులు చేతిలో హతమైంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కైకలూరులో నాయకుల కరపత్రాల పంపిణీ



ముసునూరు మండలం గుడిపాడులో..



కలిదిండి మండలం పెదలంకలో..



ముదినేపల్లి మండలం ములకలపల్లిలో..

సుపరిపాలన కూటమికే సాధ్యం

ఇంటింటికి టీడీపీలో ఆ పార్టీ నాయకులు

కైకలూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యమని జిల్లా టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి అన్నారు. ఆదివారం కైకలూరులోని 116, 117వ బూత్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి అప్పులే తప్ప అభివృద్ధి జరగలేదని అన్నారు. బూత్ కన్వీనర్లు రసూల్‌ఖాన్, లక్కింశెట్టి మోహన్, కోకన్వీనర్ సయ్యద్ బషీర్, టీడీపీ నాయకులు వేములపల్లి కారుణ్య, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఆచవరంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ గ్రామ నాయకులు తలారి చిన్న సీతారామయ్య, ఏకుల పరుశురాముడు, మువ్వ రాంబాబు పాల్గొన్నారు.

కలిదిండి: పెదలంకలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరాంజనేయులు, నాయకులు అక్కల వెంకటాచలం, దున్న భోగేశ్వరరావు, దుగ్గిరాల పర మేశ్వరరావు, రెడ్డి చక్రవర్తి, కొల్లాటి సత్యనారాయణ, వడుగు గోపాలరావు, ముద్దం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ములకలపల్లిలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రైతు ఏలూరు పార్లమెంటు అధికార ప్రతినిధి బొప్పన సుందరరామయ్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, పేదరికం నిర్మూలనకు చంద్రబాబు నాయకత్వం అత్యంత అవసరమన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు సుంకర నాయకులు శ్యామ్, మధుసూదనరావు, దాసరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైవాకలో టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొని ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు ఎన్నికల వాగ్దానాల అమలు తదితర సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. వైవాక గ్రామ పార్టీ అధ్యక్షులు నగుళ్ల బాలాజీ, కార్యదర్శి బోయిన రాంబాబు, బూత్ కన్వీనర్లు గోరుముచ్చు శివకుమార్, కాగిత శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. ఆదివారం గుడిపాడులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మండలపు దర్మరాజు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏడాదిలోనే సూపర్ సిక్స్ పథకాల్లో 75 శాతం హామీలను నెరవేర్చి, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ సీఎం చంద్రబాబు సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. బూత్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: కూటమి సర్కార్ పాలనతో నవ్యాంధ్రలో సువర్ణాధ్యాయం మొదలైందని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, తేళ్లూరి శేఖర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చనుబండలో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ ములగలపాటి శ్రీనివాసరావు, మహేశ్వరరావు, తేనేటి వేణు ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

తేలని కోడూరు యూపీ స్కూల్ వ్యవహారం

- పాఠశాలలు ప్రారంభమైనా ఇళ్ల వద్దే విద్యార్థులు
- టీసీలు తీసుకునేందుకు నిరాకరణ
- విచారణలే తప్ప చర్యలేవీ?

ముదినేపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునర్వ్యవస్థీకరణలో ముదినేపల్లి మండలం కోడూరు గ్రామంలోని యూపీ పాఠశాల స్థాయిని తగ్గించి బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయటంపై నెలకొన్న సమస్య ఎటూ తేలకపోవటంతో ఆ పాఠశాల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ యూపీ పాఠశాల బేసిక్ ప్రైమరీ పాఠశాలగా డీగ్రేడ్ కావటం, 6, 7, 8 తరగతులు చదివేందుకు దూర ప్రాంతాల్లోని హైస్కూళ్లకు వెళ్లటం ఇబ్బందికరం కావటంతో విద్యార్థులు ఏ హైస్కూల్‌లోను చేరకుండా ఇళ్ల వద్దనే ఉండిపోయారు. ఈ పాఠశాలలో 5 నుంచి 6వ తరగతికి, ఆరు, ఏడు తరగతుల నుంచి ఏడు, ఎనిమిదవ తరగతులకు ప్రమోట్ అయిన 20 మంది విద్యార్థుల్లో ఒక్కరు కూడా హైస్కూళ్లలో చేరేందుకు టీసీలు తీసుకోలేదు. కోడూరు నుంచి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముదినేపల్లి, పెదపాలపర్రు హైస్కూళ్లకు పంపలేక తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్ల వద్దే ఉంచేశారు. తమ గ్రామంలోని యూపీ స్కూలును కొనసాగించాలని టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించి విద్యాశాఖ అధికారుల చుట్టూ తిరిగినా గత 25 రోజులుగా ఫలితం కనిపించలేదు. స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ కామినేని శ్రీనివాస్ కోడూరు యూపీ స్కూల్‌ను కొనసాగించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాశారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వచ్చి డీగ్రేడ్ వల్ల విద్యార్థులకు ఎదురయ్యే ఇబ్బందులపై విచారణ జరిపారే తప్ప ఆ నివేదికలపై ఎటువంటి చర్యలు ఉన్నతాధికారులు తీసుకోలేదు. దీంతో ఈ యూపీ పాఠశాలను కొనసాగిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మండల స్థాయి నుంచి రాష్ట్ర విద్యాశాఖ అధికారుల వరకు చేరిన ఈ స్కూల్ స్థాయి తగ్గింపు వ్యవహారం ఎప్పటికి కొలిక్కి వస్తుందోనని ఎదురుచూస్తున్నారు.



డీగ్రేడైన కోడూరు యూపీ పాఠశాలల విద్యార్థుల ఎదురుచూపులు

దేశ సమగ్రత కోసం పోరాడిన ముఖర్జీ



నూజివీడులో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ముదినేపల్లిలో ముఖర్జీ చిత్రపటం వద్ద బీజేపీ నాయకుల నివాళి

నూజివీడు టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, సమైక్యత కోసం చివరివరకు పోరాడిన మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు నాగరాణి నివాళులర్పించారు. ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం నూజివీడు లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బీజేపీ నాయకులు ఎం. రాజశేఖర్, మాటూరి రవికాంత్, దోసపాటి మల్లికార్జున జగదీష్, అంబటి మల్లేశ్వరరావు, సాయిన సత్యనారాయణ, అజీజ్, తదితరులు పాల్గొన్నారు. మండల బీజేపీ కన్వీనర్ శివ దేవరగుంటలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నెక్కలపు కృష్ణారావు, భావరాజు పుల్లారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరులో బీజేపీ జిల్లా కార్యదర్శి మాగంటి వాసు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత వ్యక్తి ముఖర్జీ అన్నారు. నాటి కేంద్ర ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా, హిందుస్థాన్ ఏరోనాటికల్, చిత్తరంజన్ లోకోమోటివ్ ఇంజన్స్ కర్మాగారం, సేంద్రియ ఎరువుల కర్మాగారం ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. బడుగు శ్రీకాంత్, కాటేపల్లి వెంకటరత్నం, డోలా చింతయ్య పాల్గొన్నారు.

ముదినేపల్లి: పెయ్యేరు ఆటోనగర్‌లోని బీజేపీ మండల కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి తదితరులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అల్లూరులో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు రెడ్డి రాధిక ఆధ్వర్యంలో ముఖర్జీ జయంతి జరిగింది.

మండవల్లి: మండవల్లిలోని 38వ బూత్ పరిధిలో బీజేపీ నాయకుడు గంగునేని వరప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసంఘ్ పార్టీ నేడు బీజేపీగా పేరొందిందన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బండి దివాకర్, పార్టీ నాయకులు యర్రంశెట్టి శ్రీనివాస్, యడ్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనిపాడులో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ తదితరులు



చనుబండలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

ముసునూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, వారి ఆశాజ్యోతిగా నిలిచిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ఉపప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా కాట్రేనిపాడు ఎస్సీ కాలనీలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్ దంపతులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలను నెరవేర్చేలా నేటి యువత ముందుకు సాగాలని కోరారు. ఎమ్మార్పీయస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

చాట్రాయి: చనుబండలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, టి. శేఖర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితోద్ధారణకు ఆయన కృషిని కొనియాడారు. ఎం.శ్రీనివాసరావు, రాజా, ముత్తయ్య, రవి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



ముసునూరులో ప్రత్యేక అలంకరణలో వేంకటాచలేశుడు



కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళల పారాయణ



కైకలూరులో రామలింగేశ్వరస్వామికి సారెను తీసుకువస్తున్న బందా చంద్రశేఖర్ కుటుంబీకులు



దేవపూడిలో విజయ దుర్గాదేవికి ఆషాఢ సారెను తీసుకెళ్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

కైకలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీమీసాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఆలయ ఈవో శేఖర్ పర్యవేక్షించగా వికాసతరంగణి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో మహిళలు పారాయణం నిర్వహించారు.

ముదినేపల్లి: తొలి ఏకాదశి పూజలు ఆదివారం మండలంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వడాలిలోని శ్రీ సుభద్ర బలరామ సహిత శ్రీజగన్నాథస్వామి దేవస్థానం, గురజలోని శ్రీ వేణుగోపాలస్వామి, సింగరాయపాలెం శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయాల్లో మహిళలు పూజలు జరిపారు. ఈఓలు సింగనపల్లి శ్రీనివాసరావు, ఎ.కొండలరావు ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలతో మహిళలు పూజలు జరిపారు. విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు.

ముసునూరు: ముసునూరులోని వేంకటాచల స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీ వెంకటేశ్వర భక్త బృందం విష్ణు సహస్రనామ పారాయణం చేసింది. ఆలయ చైర్మన్ దేవినేని వరప్రసాదరావు దంపతులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు. అలాగే గోగులంపాడు, గోపవరం, చెక్కపల్లి తదితర గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

శాకాంబరిగా వారాహి అమ్మవారు



మండవల్లి: మండవల్లిలో వారాహి అమ్మవారు ఆదివారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. విజయదుర్గా అమ్మవారి ఆలయం లో వారాహి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా పూజలను ఘనంగా నిర్వ హించారు. ఆలయ పండితులు చాగంటి పాటి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. శాకాంబరి అమ్మవారికి భక్తులు కూరగాయలు సమర్పించారు.

సారె సమర్పణ..

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి ఆషాఢ సారెను ఆదివారం బందా వంశీకులైన బందా చంద్రశేఖర్ దంపతులు ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ ఈవో శేఖర్ వారికి స్వాగతం పలకగా అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.

ముదినేపల్లి: చేవూరుపాలెంలో పరసావారి ఇలవేల్పు అంకమ్మ వారికి ఆదివారం గ్రామంలోని పరసా కుటుంబీకులు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో వచ్చి ఆషాఢ సారె సమర్పించారు. శ్రీహరిపురంలోని గంగానమ్మ అమ్మవారికి కూడా మహిళలు ఆషాఢ సారె సమర్పించారు.

కలిదిండి: భాస్కరరావుపేట గ్రామ దేవత పోలేరమ్మకు మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: దేవపూడిని విజయ దుర్గాదేవి అమ్మవారికి గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలతో పలువురు మహిళలు ఎర్రటి దుస్తులు ధరించి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో ఆలయం వద్దకు చేరి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకుడు దాసరి భగవాన్ దాస్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు చావలి సత్యసాయిబాబా శర్మ అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. సర్పంచ్ దాసరి కాశీ అన్నపూర్ణ దంపతులు పాల్గొన్నారు.